కలిసి ఉండాలని సరదా. వాళ్ళ ఇల్లేమో ఊరికి చివరవుండటాన సాధారణంగా ఎవ్వరూ వెళ్లేవారు కారు. అందులోనూ ఆ ఇంటికి ఇదివరలో 'దెయ్యాల మేడ' అని పేరు. ఇప్పు డేదో బాగుచేయించినా ఇంటి కాపేరు, ప్రజల్లో ఆభయం పోలేదు. ఆయనకు చుట్టాలూ, బంధువులూ అంతగా లేకపోవటాన, ఎవ్వరూ వచ్చేవారుకారు. అందుకని ఏమీ తోచక శ్యామసుందరి, నన్ను, నిర్మలను శని ఆదివారాలు వచ్చి వాళ్ల ఇంట్లో ఉండిపొమ్మని బ్రతిమాలేది. అప్పుడప్పుడు హాస్టల్‌లో అనుమతి తీసుకొని అలాగే ఉండే వాళ్ళం.

అలవాటు ప్రకారం ఒక శనివారంనాటి సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళాం. ముగ్గురం హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటుండగా, నిర్మల చటుక్కున విరబోసుకున్న శ్యామసుందరి జుట్టు వైపు చూచి "దెయ్యంలా! ఏమిటలా జుట్టు విరబోసుక్కూర్చున్నావ్. జుట్టు చివర్న చిన్న ముడి వేసుకోవాలంటారు. లేకపోతే దెయ్యాలు పట్టుకుంటాయట" అన్నది.

శ్యామసుందరి నవ్వుతూ, "నాకా శాస్త్రం తెలియదే! సరే ఉండు" అని జుట్టు ముడివేసుకుంటూ, "అన్నట్టు ఈ ఇంట్లో ఓ చదువుకునే అమ్మాయికి మశూచికం వచ్చి పోయి, దెయ్యమయిందని చెప్పుకుంటారు. చాలా తెలివైనదట. అందంగా కూడా ఉండేదట పాపం! కాని మాకెవ్వరికీ దెయ్యం కనపడలేదు సుమా?" అన్నది.

మేమిద్దరం "అయ్యో" అని విచారిస్తుండగా శ్యామసుందరి "ఏమ్రా! అనుకోకుండా దెయ్యాల సంగతి వచ్చింది. ఏమైనా దయ్యాల కథలు చెబుదురూ, నాకంతగా తెలియదు" — అన్నది.

నిర్మల వాళ్ళ నాయనమ్మతో రోజూ, వంటింటి అవతల కూర్చొని, మాట్లాడి, తీరా ఒకనాడు ఆవిడ తలుపు తీసి చూచేసరికి మాయమై మరి కనపడ్డం మానేసిన దెయ్యంసంగతిచెప్పింది. నేను మా తాతయ్య చెప్పిన దయ్యాల కథలేవో చెప్తున్నాను. ఇంతలో ఉన్నట్టుండి "హోరు" మని వర్షం కురియడం మొదలు పెట్టింది. మరి కాస్సేపటికి గేటు తీసుకుని ఎవరో అమ్మాయి గబ గబా పరిగెట్టుకు రావడం కనిపించింది. నౌకరు రామన్నను ఆ అమ్మాయిని లోపలికి తీసుకు రమ్మని పంపింది శ్యామసుందరి. ఆ అమ్మాయి సన్నగా, తెల్లగా పాలిపోయినట్టున్నది. రాగానే మాకు "థ్యాంక్స్" చెప్పి, కుర్చీలో కూర్చుంటూ, తాను ఎవరో స్నేహితురాలింటికి బయలు దేరినట్టు, త్రోవలో అనుకోకుండా వర్షం వచ్చినట్లూ చెప్పింది. ఆ అమ్మాయి పేరు వసంతట.

నలుగురం కూర్చున్నాక శ్యామసుందరి "ఇంకా ఏమైనా దెయ్యాల కథలుంటే చెప్పండర్రా! సరదాగా ఉంటుంది" అన్నది.

నేను "ఆ! ఏమున్నాయి లెస్తూ! అన్నీ వట్టి గాలి కబుర్లే. వాటిని మన తరంలో ప్రత్యక్షంగా చూచిన వాళ్లెవ్వరూ లేరు. మా పెద్దనాన్నగారన్నట్లు, ఎలక్ట్రిక్ దీపాలు వచ్చాక దెయ్యాలు పారిపోయాయి లేవే?" అన్నాను.

వసంత ఉలిక్కి పడ్డట్టయి బైటకు చూసింది. వర్షం ఇంకా బాగా ఎక్కువైపోయింది. రెండు మూడు గంటలకైనా తగ్గుతుందో లేదో చెప్పటం కష్టం. వసంతవైపు చూచి, "మరేం దిగులు పడకండి. టైమింకా నాలుగు అయింది. ఆరు, ఏడు గంటల వరకూ చూద్దాం. అంతగా తగ్గకపోతే మా శ్యామసుందరి మిమ్మల్ని కార్లో సురక్షితంగా మీ ఇంటికి దిగబెడుతుంది. లేదా! ఈ మాటు మీరిక్కడ ఈ పూట ఉండి పోయారా, శ్యామసుందరికి మరీ సంతోషం" అన్నది నిర్మల.

వసంత మెల్లిగా నవ్వుతూ, "అబ్బే! అందుకు కాదు. వర్షం వెలిసిపోయాక, నడిచే వెళ్ళిపోతాను, మా ఇల్లీ చుట్టు ప్రక్కలే ఉంది. మీరిందాకన్న మాటలకు నేను ఉలిక్కిపడ్డాను. నా ఈ చిన్న జీవితంలో దెయ్యాన్ని కళ్ళారా చూడలేదు కాని, వాటి చిత్రమైన చేష్టలు మాత్రం అనుభవంలోకి వచ్చాయి" అన్నది.

వెంటనే మేం ముగ్గురం "అదేమిటి! మాకు

"కాపిటల్ అంటే ఏమిటమ్మా!" ఇకనామిక్స ప్రొఫెసర్ ప్రశ్న.
"ఎవరివాళ్ళ దగ్గరుంటే డబ్బు"
"మరి లేబర్ అంటేనో" మళ్లీ ప్రశ్న.
"వాడి దగ్గరున్న డబ్బులో ఎంతో కొంత రాబట్టుకోటం"
అని ఆ విద్యార్థి సమాధానం.

సూర్యనారాయణ (మధురాంతకం)

వినిపించమని" వేధించడం మొదలు పెట్టాం. వసంత మెల్లిగా మొదలు పెట్టింది.

"అప్పుడు నేను ఈ ఊళ్లో మా బంధువులింట్లో ఒక గదిలో ఉండి చదువుతుండేదాన్ని. వాళ్ళిల్లు చాలా పాతది. వాళ్ళకు డబ్బు ఆట్టే లేక, గోడలనీ బాగు చేయించి, ఇంటికి సున్నం వేయించేవారుకాదు. గోడలకున్న పెచ్చులు వూడి నేలమీద పడిపోతుండేవి. ఒక ఆదివారం బద్ధకంగా ఉండి, ఏమీ తోచక మంచంమీద పడుకుని గోడ వేపు చూస్తున్నాను. నాకు బాగా చిత్రలేఖనం వచ్చును. ఆ పెచ్చులూడిపోయిన చోట్లు చూస్తుంటే, విచిత్రవిచిత్రాలైన చిత్రాలెన్నో కనిపించాయి. అన్నిటికంటె ముఖ్యంగా ఒకచోట అందమైనమైన అమ్మాయి రూపం కనిపించింది. అది నా భ్రమ ఏమో ననిపించేది. కానీ, ఆనాటినుండి రోజూ, ఆ గోడవైపు తిరిగినప్పుడల్లా చూడ్డం అలవాటైపోయింది. రోజుకు రోజూ, ఆ ఆకారం మరింత స్పష్టంగా కనిపించేది. మిగిలినచోట గోడమీది ఆకారాలు రకరకాలుగా మారినా, ఆ ఆకారం మాత్రం చెక్కు చెదరకుండా ఉండేది. నా ఆశ్చర్యానికి అంతులేదు! ఇలా ఉండగా నాకా రోజుల్లోనే జ్వరం వచ్చి, వారం రోజులు ఎక్కడికి కదలలేక పోయాను. ఆ రోజుల్లో ప్రక్కమీద పడుకొని, ఆ గోడమీది బొమ్మనే చూస్తుండేదాన్ని. ఆ ఆకారం మరింత స్పష్టంగా కొట్టవచ్చినట్లు కనిపించేది. జ్వరం తగ్గినా, నీరసంగా ఉండి, రెండు మూడు రోజులవరకూ ఎక్కడకూ కదిలే స్థితిలో నేను. ఏమీ తోచక, ఒక రోజున ఆ ఆకారాన్నిబట్టి, ఆ అమ్మాయి చిత్రం గీశాను. ఎంత అందంగా ఉందో చెప్పలేను. అది నా పుస్తకంలో పెట్టుకున్నాను. నా పిచ్చి అంతటితో తగ్గలేదు! అలాంటి అమ్మాయి సజీవంగా, ఎక్కడో ఉండో తీరాలనే నమ్మకం పట్టుకున్నది. నాకు తెలిసిన వాళ్ళలో ఎవరైనా అలా ఉన్నారేమోనని చూస్తుండేదాన్ని. చివరకు సెలవల్లో ఇంటికి వెళ్ళినప్పుడు ఉండబట్టలేక అక్కయ్యకా సంగతి చెప్పి, అలాంటి అమ్మాయి కనిపిస్తుందేమోనని తనను కూడా చూడమన్నాను.

అక్కయ్య అది నా చేతిలోనుండి లాక్కొని "బాగానే ఉంది నీ వెర్రి! బొమ్మ బాగానే వేశావు కానీ, ఇలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు! నీకు డ్రాయింగు వచ్చు కాబట్టి ఆ గీతలలాగే కనిపించి ఉంటాయి. ఇది నీ దగ్గర ఉంటే చదువు చదివి నట్లే! జాగ్రత్తగా చదువుకో!" అని చీవాట్లు పెట్టింది. ఎంత బ్రతిమాలినా ఆ అమ్మాయి చిత్రం ఇవ్వలేదు. తనే జాగ్రత్తగా దాస్తానన్నది. అలాగే ఫ్రేం కట్టించి తన బల్లమీద పెట్టుకున్నది. నేను చేసేదిలేక ఆ మాట మరిచిపోయి, చదువులో పడ్డాను.

అక్కయ్యకు పెళ్ళి కావడం అక్కా, బావ అమెరికా రికా వెళ్ళిపోవడం, అన్నీ అనుకోకుండా జరిగిపోయాయి

ఒకనాడు అక్కయ్య దగ్గిరనుండి వచ్చిన ఉత్తరం చదువుతూ ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాను. అక్కయ్యతో రిసెర్చి చేస్తున్న మాలిని అనే మళయాళీ అమ్మాయి, నేను వేసిన చిత్రం ముమ్మూర్తులా ఒకలా ఉన్నాయట! ఇంకో తమాషా జరిగిందట. ఇద్దరూ భారతీయులు కావడంతో బాగా స్నేహమయిందనీ, ఒకరోజు వాళ్ళింటికివచ్చి తన బల్లమీద ఉన్న నా పెయింటింగ్ చూసి, ఆ అమ్మాయి "అరె! నువ్వింత గొప్ప చిత్రకారిణివా? నా చిత్రం ఎంత బాగా వేశావ్!" అని తెగ పొగిడిందనీ—తనకేం చెప్పాలో తోచక, కాస్సేపు ఆలోచించి, అది వేసింది తను కాదనీ, తాము తీయించుకున్న గ్రూపు ఫోటో సరదాకు పంపగా, తన చెల్లెల్లయిన నేను వేసి పంపాననీ, కాస్త కల్పన జోడించి చెప్పిందట. అంతవరకూ తనా విషయమే గమనించలేదట. పైగా తన చెల్లెలు అందమైన అమ్మాయిల ఫోటోలు తెగవేస్తుందని—ఒక కోత కోసిందట. వెంటనే ఆ అమ్మాయి, తన ఫోటోలు నాలుగైదు ఇచ్చి, వాటిని వీలైనప్పుడు పెయింట్ చేయించమని చెప్పిందనీ—తనకూ కళలంటే చాలా ఇష్టమనీ, అయితే డ్రాయింగ్ మాత్రం రాదనీ — తనకూ సంగీతం చాలా బాగా వచ్చుననీ చెప్పింది. నీ కిష్టమైతే నీతో ఉత్తరాల ద్వారా స్నేహం కలుపుకోవాలని ఉంది. ఏమంటావ్" అని వ్రాసింది.

నా ఆశ్చర్యానికీ, ఆనందానికీ హద్దులులేవు. మెల్లిగా మాలినికి నాకూ స్నేహం కలిసింది. అక్కా

**కలిసేది ఆ పిల్లే నాకు తప్పురా [illegible]. ఉత్తరా లలో అనేక విషయాలు చర్చించుకునే వాళ్ళం.** ఆ అమ్మాయివి చాలా చిత్రాలు గీశాను. కొన్ని నా దగ్గర పెట్టుకొని, కొన్ని తనకు పంపించాను. కొన్ని ఉత్తరాలలో ''నువ్వు నా రూపాన్ని కాగితం మీద సజీవంగా నిలిపి నన్ను సంతోష పెడు తున్నావు. సంగీతం తప్ప నాకేమీరాదు. దాన్ని నీకు బదులు మీ అక్కయ్యకు వినిపిస్తుంటాను''—అని వ్రాసేది.

కొన్నాళ్ళు పోయేసరికి మాలిని దగ్గరనుండి ఉత్తరాలు రావడం మానివేశాయి. అదేమిటో నా గోడమీది చిత్రం కూడా కళతప్పి, మసకగా కని పించసాగింది. ఒకరోజు అదేమిటో తెల్లారి లేస్తూనే ఏమిటో బొత్తిగా హుషారుగా లేకుండా మంద కొడిగా ఉన్నది. లేవగానే వాడుక ప్రకారం గోడ వైపు చూసి ''గతుక్కు'' మన్నాను! అక్కడ చిత్రం లేదు! ఏమిటో మనస్సంతా ఆందోళనగా ఉంటే, ఎలాగో మెల్లిగా కాలేజీకి బయల్దేరు తుండగా అక్క దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. అసలే కాలేజీకి వెళ్ళాలని లేదు. ఉత్తరం రాగానే

# గోడమీది గీతలు

మరీ వెళ్ళాలనిపించలేదు. ఇంట్లోకి వచ్చేసి మెల్లిగా ఉత్తరం విప్పి చదివాను. ''షాక్'' తిన్నట్లయింది. అందులోని వార్తలు చూస్తుంటే. మాలిని మశూచి వచ్చి పోయిందట. నే వ్రాసిన మాలిని పెయిం టింగ్ కూడా మాయమై పోయిందట! నాకైతే ఎవరో ఆత్మబంధువులను పోగొట్టుకున్నట్లని పించింది. భోరున ఏడిచాను. మాలిని వ్రాసిన ఉత్తరాలు, ఆ అమ్మాయి ఫోటోలు అన్నీ జాగ్ర త్తగా పెట్టెలో పెట్టాను. అవి ఉన్నాయో లేవో కాస్సేపు చూద్దామని పెట్టె తీసిచూస్తే ఆశ్చర్యం! ఒక్క ఉత్తరం లేదు! ఫోటోలు లేవు. గదంతా వెదికాను''—అన్నది నిట్టూర్పు విడిస్తూ. వర్షం తెరిపి ఇచ్చింది.

వసంత చెప్పిన కథ ముందు అంతకుముందు విన్న దయ్యాల కథలన్నీ దిగదుడుపే ననిపించింది. నోట మాట రాక కూర్చున్న మమ్మల్ని చూసి, మన బుద్ధికందని, నమ్మశక్యంగాని విషయాలు ఇందులో కొన్ని ఉన్నాయి. వాటిని ఏ శాస్త్రజ్ఞానం తోనూ, పరిష్కరించలేము. ఎక్కడో అమెరికాలో వున్న మాలిని చిత్రం నా గోడమీది కెలా వచ్చింది? సరిగా అక్కకు ఆవిడ క్లాసుమేటుగా ఎలా జత పడింది? ఈ రెండూ పోనీ కాకతాళీయంగా సరి పోయాయనుకున్నా ఆవిడ పోగానే, ఆ చిత్రం, ఆవిడ వ్రాసిన ఉత్తరాలు ఎలా మాయమయ్యాయి? ఈ పని మానవాతీతమైన ఏ దయ్యాలో, దేవతలో చేసిన పనులని రూఢిగా నమ్మవల్సిందే! ఇంక అన్నిటికంటె చిత్రమైన చివరి విషయం—. అంటూ వసంత వెళ్ళిపోవడానికి లేచి నిలబడింది.

''అదేమిటో......'' అన్నది నిర్మల నెమ్మదిగా

''అది ఇదే! ఈ కథను నే నొక అరగంటక్రితం కల్పించి మీకు చెప్పడమే!'' అంటూ వెనుతిరిగి చూడకుండా వెళ్తున్నది.

''శుద్ధ మూర్ఖులమై, కట్టుకథను ఎంత శ్రద్ధగా విన్నామ్రా బాబూ'' అనుకొంటూ, వసంత వెళ్ళిన వైపు చూచేసరికి ఆవిడ ఎక్కడా లేదు! వసంత మాయమై పోయింది!!

(ఒక ఇంగ్లీషు కథ ఆధారంగా) ★

## చదువుల్రావు - బి. వి. సత్యమూర్తి

